క్లుప్తంగా

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ



పరీక్ష కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రహెమాన్

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమవగా.. కేంద్రాన్ని డీఎస్పీ అబ్దుల్ రెహిమాన్ పరిశీలించారు. పరీక్షల తీరుతెన్నులను ఆయన తెలుసుకున్నారు.

తాగునీటి సమస్యపై వినతి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పర్యటించారు. ముందుగా గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అలాగే సీడీపీ నిధుల నుంచి బోర్ మంజూరు చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొడిమి సీత, ఎంపీటీసీలు వల్లపు తిరుపతిరావు, నారం నాగలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, చిన్నంశెట్టి వెంకట నరసింహ, జే వెంకన్న, గ్రామ కమిటీ నాయకులు ఎస్కే అమీర్, పుట్టా సత్యనారాయణ, నరసింహారావు, గారపాటి పుల్లారావు, నూలకాని శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ములకలపల్లి: ఐసీడీఎస్ ములకలపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ములకలపల్లిలో గుడ్‌షఫర్డ్ సంస్థ ఆవరణలో సూపర్‌వైజర్ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 15 మంది గర్భిణులకు, ముగ్గురు పిల్లలకు పుట్టినరోజు వేడుకలు, ఒక చిన్నారిని అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, గుడ్‌షఫర్డ్ సిస్టర్ నిర్మల, ఐసీడీఎస్ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్య

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.అయోధ్య అన్నారు. గురువారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపాలిటీలో ఉపాధిలేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో పనులకు వెళ్తున్నారని, మణుగూరు మున్సిపాలిటీని పంచాయతీగా ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. మున్సిపాలిటీలో ఓ వైపు ప్రజలు కనీస అవసరాలకు నోచుకోలేకపోతుండగా.. మరోవైపు వారిపై మోయలేని పన్ను భారం వేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే మణుగూరు మున్సిపాలిటీని పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, సరెడ్డి పుల్లారెడ్డి, సొందె కుటుంబరావు, మున్నా లక్ష్మీ కుమారి, అక్కి నర్సింహారావు, లక్ష్మీనారాయణ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గురువారం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పాలచర్ల గ్రామానికి చెందిన కాకాని ఆది అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మార్గం మధ్యలోని స్థానిక కాకతీయ గేట్ వద్ద ఓ వ్యాన్ యూటర్న్ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆది ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో ఆది తలకు బలమైన గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికు తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

గర్భిణులను వేధిస్తున్న రక్తహీనత

- పరిష్కారానికి మాత్రలపైనే దృష్టి
- పోషకాహారానికి లేని ప్రాధాన్యత
- ఆహారమే ఔషధమంటున్న నిపుణులు



వైద్య పరీక్షల కోసం పినపాక ప్రభుత్వాస్పత్రి వద్ద వేచి ఉన్న గర్భిణులు

పినపాక: బిడ్డకు జన్మనిచ్చే గర్భిణులు రక్తహీనతతో అవస్థలు పడుతున్నారు. పోషకాహారంలోపం కాబోయే తల్లిని అనారోగ్యం బారిన పడేస్తోంది. ప్రసవ సమయంలో సమస్యల్లోకి నెట్టేస్తోంది. పుట్టే బిడ్డలు సైతం ఆరోగ్య సమస్యలతో పుట్టడానికి దారి తీస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 14,230 మంది గర్భిణులు ఉండగా వీరిలో 2380 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రస్తుతం 230 మంది గర్భిణులు ఉండగా వీరులో అధిక శాతం మందిని రక్తహీనత వేధిస్తుంది. ప్రతి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని రక్తహీనతను అధికమించేందుకు పదుల సంఖ్యలో ఐరన్ టాబ్లెట్లు వాడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్వహణ లోపం..

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు అంగనవాడీ కేంద్రం ద్వారా పోషకాహారం పంపిణీ జరుగుతోంది. జిల్లా స్థాయి అధికారులకు నూరు శాతం పోషికాహారం అందిస్తున్నట్లు నివేదికలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తీవ్ర లోపాలున్నాయి. ఉదాహరణకు.. ఇటీవల కాలంలో సుమారు నెలపాటు గుడ్లు పంపిణీ జరగలేదు. దీంతో గర్భిణులకు నెల రోజులపాటు ఉడికించిన గుడ్లు అందలేదు. పాల పంపిణీ విషయంలో సైతం పంపిణీ సక్రమంగా జరగలేదు. ఇవ్వాల్సిన మోతాదుల్లో సైతం సరఫరా జరగడం లేదనే నెపంతో కోత విధిస్తున్నారు. గర్భం దాల్చిన నెల నుంచి తీసుకోవాల్సిన పోషకరంపై అవగాహన కల్పించి నిత్యం ఆహార పట్టికకు అనుగుణంగా ఆహారం, గుడ్లు, పాలు అందించాల్సి ఉంటుంది. ఈ క్రమాన్ని తూచా తప్పకుండా పటించి ఉంటే రక్తహీనత దరిచేరేది కాదు. ఉన్నతాధికారులకు నివేదికలు ఒకలాగ, అమలులో మరోలాగా కొనసాగడంతో పోషకాహార లోపాన్ని ఆశించిన స్థాయిలో అరికట్టలేకపోతున్నారని స్పష్టమౌతోంది.

పౌష్టికాహారంతోనే పరిష్కారం

గ్రామాల్లో ఎక్కువగా పోషకాహార సమస్య ఉంది. గర్భిణులు కేవలం మందులు మీదే ఆధారపడకుండా.. తీసుకునే ఆహారంతో ఈ సమస్యను అధికమించవచ్చు. గర్భిణులు తప్పనిసరిగా పోషక విలువలు ఉన్న ఆహారం, సమతుల్య పద్ధతిలో తీసుకోవాలి. తద్వారా మార్పును గమనించవచ్చు.

– దుర్గాభవాని, పినపాక వైద్యాధికారిణి

ఏరియాలో రక్షణ వారోత్సవాలు



సివిల్ విభాగంలో పారిశుద్ధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



మణుగూరు ఓసీలో రక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని సివిల్ విభాగంలో గురువారం రక్షణవారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగులు కార్మికులు నిరంతరం రక్షణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం సైతం ఒక్కోసారి సమస్యగా మారుతుందన్నారు. సింగరేణి సంస్థలో భద్రతా ప్రమాణాలు కీలకమని తెలిపారు. మెరుగైన రక్షణప్రమాణాలతో పరిశ్రమలు ప్రగతి సాదిస్తాయన్నారు. అందుకోసం అందరు కృషి చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులతో రక్షణప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఈ సివిల్ రాజేంద్రప్రసాద్, ఈఈ(సివిల్) ప్రవీణ్, అజయ్‌లు పాల్గొన్నారు.

లాగ్‌బుక్ నిర్వహణతో ఉపయోగం

భారీ యంత్రాల్లో లాగ్ బుక్ నిర్వాహణ ఎంతోగానో ఉపయోగపడుతుందని, అది ఆపరేటర్ల కనీస బాధ్యగా గుర్తించాలని ఏరియా రక్షణ అధికారి జేవీ రమణ అన్నారు. గురువారం మణుగూరు ఏరియాలోని పీకే ఓసీల్లో పనిచేసే ఆపరేటర్లకు రక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ యంత్రాలు నడిపే ప్రతి ఆపరేటర్.. యంత్రాలకు సంబంధించిన ఏదైనా ఇబ్బందులు ఉంటే లాగ్‌బుక్‌లో నమోదు చేయాలన్నారు. ఆ తరువాత డ్యూటీకి వచ్చే ఆపరేటర్ సంబంధిత అంశాలను తనిఖీ చేసుకోవాలన్నారు. రక్షణ పరంగా ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్మికుల చేత రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీకే ఓసీ ప్రాజెక్టు మేనేజర్ మాలోత్ రాముడు, పీకే ఓసీ–4 మేనేజర్ శ్రీనివాస్, ఓబీ ఇన్‌చార్జ్ కల్యాణ్‌రామ్, రక్షణ అధికారి లింగబాబు, దుర్గ కంపెనీ అదికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఎంపీపీ రేసు లక్ష్మి

దుమ్ముగూడెం: మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా సాగింది. ముందుగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టి 5వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమావేశం కొనసాగగా.. వివిధ శాఖల అధికారులు ఈ 3 నెలల కాలానికి చెందిన పురోగతి వివరాలను సభకు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు పలు అంశాలపై సంబంధిత అధికారులను నిలదీశారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అదనంగా భూములు సేకరిస్తున్న నేపథ్యంలో సీతమ్మసాగర్ డీపీఆర్‌ను సమావేశం ముందు ఉంచాలని కోరారు. అనంతరం ప్రజాప్రతినిధులకు ఆటలపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ ముత్యాలరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టి ఏళ్లు గడుస్తున్నా మండలంలో ఇంకా అనేక గ్రామాల్లో మంచినీటి సమస్య నెలకొందని, ఈ వేసవికి కూడా నీళ్లందించకుంటే ఎలా అని జెడ్పీటీసీ హనమంతు, ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంజు భార్గవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో వారు మాట్లాడుతూ.. త్వరితగతిన పైపులైన్లు పూర్తి చేసి ప్రతీ గ్రామానికి నీళ్లు అందించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రావాల్సిన నష్టపరిహారం, గ్రామాలలో కరెంటు స్తంభాలతోపాటు ఇతర సమస్యలను సభ ముందు ఉంచగా.. పరిష్కరిస్తామని అధికారులు బదులిచ్చారు. ఈ సమావేశానికి 21 శాఖలకు గానూ, 9 శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడంతో వారిపై మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాదియా సుల్తానా, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీటీసీ సత్యావతి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రకు కదలిరావాలి



చండ్రుగొండ: యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్రకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని మారాయిగూడెం గ్రామంలో గ్రామ జనరల్ బాడీ సమావేశంలో జనచైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనలో భాగంగా ఈనెల 20 తేదీన జరిగే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోడం తిరుపతిరావు, సున్నం వెంకటేశ్వర్లు, సోందే ఎడమయ్య, ఎర్రయ్య, సోయం భూపతి, కారం కోమర్రయ్య, శ్రీరాములు, రాముడు వీరస్వామి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: బీజేపీ మతోన్మాదం, ఆర్థిక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి చేపట్టనున్న జనచైతన్యయాత్రను జయప్రదం చేయాల్సిందిగా ఆ పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటాచారి, ఏ.నాగేశ్వరరావు, కాంతారావు, భూపాల్ పాల్గొన్నారు.

ములకలపల్లి: ఈనెల 17వ తేదీన హన్మకొండలో ప్రారంభం కానున్న సీపీఎం జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం యాత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గోపగాని లక్ష్మీనర్సయ్య, మాజీ సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, బొర్రా జోగయ్య, ముదిగొండ రవి, కురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం పంపిణీ

చండ్రుగొండ: విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఏకరూప దుస్తులు పాఠశాలలకు గురువారం మండల విద్యాశాఖాధికారి సత్తెనపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. మొత్తం 37 పాఠశాలల్లోని 2,735 మంది విద్యార్థులకు 2023–24 ఏడాదికి సంబంధించిన ఏకరూప దుస్తులు మంజూరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యవతి, మంజుల, దేవరామ్, ప్రవీణ్‌కుమార్, సీఆర్‌పీ సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'కంటి వెలుగు' ప్రారంభం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కేంద్రం పరిధిలోని ప్రజలందరూ కంటివెలుగు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చల భారతి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కంటివెలుగు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

అశ్వాపురం: వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని అశ్వాపురం ఎస్సై సురేష్ అన్నారు. మండల పరిధిలోని జగ్గారం క్రాస్ రోడ్డులో గురువారం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై చలానాలు విధించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పెండింగ్ చలానాలు చెల్లించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

పూర్వ వైభవం తీసుకురావాలి

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాలని ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకులు అజ్మీరా రాజునాయక్ కోరారు. గురువారం సారపాకలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశానుసారం పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి రామచంద్రరావు, పోటు రంగారావు, ఎండి.ఇమామ్, వట్టం నారాయణదొర, కనకమేడల హరిప్రసాద్, వాసిరెడ్డి చలపతిరావు,కంచేటి వెంకటేశ్వరరావు, తాళ్లూరి జగదీశ్వరరావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా మొదటి సభ్యత్వాన్ని పట్టణంలోని సీనియర్ నాయకుడు కంభంపాటి సురేష్‌కు ఇచ్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పరిశీలకుడు రాజు నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు టీడీపీ ప్రభుత్వ హయంలోనే జరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, ప్రేమ్‌చంద్, ఇమామ్, షేక్ అజీమ్, చిట్టిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహకారం



క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న రేగా

గుండాల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని, క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో గత మూడు రోజులుగా సాగుతున్న రేగా క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిశాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరైయ్యారు. ఆళ్లపల్లి జట్టు ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి బోడాయికుంట గెలుచుకున్నాయి. వారిని బహుమతులు ప్రదానం చేసి రేగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడల అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనలకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ క్రీడల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. క్రీడాకారులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, జెడ్పీటీసీ కొమరం హన్మంతు, పీఏసీఎస్ చైర్మన్ రామయ్య, శంకర్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు భవాని శంకర్, నర్సింహరావు, బాబా, ఖయ్యూం, అతహార్, కిషోర్,సుబ్బారావు, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజు జాతరలో పూజలు

గుండాల మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో జరిగిన సనప వారి ఇలవేల్పు అయిన గోవిందరాజు జాతరలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొని దర్శించుకున్నారు. నిర్వాహకులు రేగాను ఘనంగా ఆహ్వానించారు. జాతర సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, రవీందర్, వీరస్వామి, అజ్జు, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దాడులను తిప్పికొట్టాలి



బూర్గంపాడు: ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఈడీ ద్వారా దాడులకు పాల్పడుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. గురువారం బూర్గంపాడు, మోరంపల్లిబంజర ప్రధాన కూడళ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కుట్రపూరితంగా లిక్కర్ స్కామ్‌లో ఇరికించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. బీజేపీ అరాచక పాలనకు తెలంగాణ సమాజం చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పాడియం నరేందర్, కొనకంచి శ్రీనివాస్, కైపు ఖగేందర్‌రెడ్డి, సోము లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. సాంబాయిగూడెం గ్రామ సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు అన్నమనేని రాజేశ్వరరావు, ఉపసర్పంచ్ పెంటుమియా, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ చిడెం నాగేశ్వరరావు, వార్డ్ మెంబర్లు జె.రమణ, పి.రమేష్, నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, వాసుబాబు, జమాల్, కాజామియా, వీరభద్రం, శ్రీను, లక్ష్మణ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

మణుగూరురూరల్: మణుగూరు పట్టణం నుంచి బీటీపీఎస్ వరకు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు పట్టణం నుంచి బీటీపీఎస్ వరకు రహదారి గుంతలమయంగా మారిందని, తద్వారా రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని అన్నారు. పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయన్నారు. దీనికి తోడు బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్ డ్రైవర్లు అధిక వేగంతో నడుపుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఫలితంగా పలువురు మృతి చెందగా.. అనేకమంది గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేయించాలని, అతివేగం, ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ గౌస్, జీవన్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి



అన్నపురెడ్డిపల్లి: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో అమరజీవి పొటి శ్రీరాములు 122వ జయంతి వేడుకలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ సంయుక్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి అన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చారుగుళ్ల శ్రీనివాస్, చింతల వినోద్‌కుమార్, నగేష్‌కుమార్, రేపాక శ్రీనివాస్, సాయిచంద్, సునీల్, పుల్లారావు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు వనమా గాంధీ, దోసపాటి రాంబాబు, వనమా వెంకటేష్, గోళ్ల ముత్తయ్య, చల్లా పుల్లయ్య, సంకా కృపాకర్,భూక్య చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఆదమరిస్తే అంతే సంగతి



మండలంలోని సత్యనారాయణపురం-కలివేరు గ్రామాల మధ్యలో సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలోని ప్రధాన రహదారి పక్కన మట్టి వరదనీటి కోతకు గురైంది. గత ఏడాది భారీగా కురిసిన వర్షాలకు ఆ ప్రాంతంలో ఉన్న కాలువ ద్వారా నీరు ఉధృతంగా ప్రవహించడంతో బీటీ రోడ్డు మట్టి సుమారు 20 అడుగుల పొడవు అంచుమట్టుకు కొట్టుకు పోయింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. ఆ ప్రాంతాన్ని సరిచేయడానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఆ గొయ్యిలో పడే ప్రమాదం ఉంది. - చర్ల

ప్రశ్నించాల్సిన అధికారి: హరిలాల్, ఆర్‌అండ్‌బీ డీఈ, భద్రాచలం

ఫోన్ నంబర్: 94408 18414